# గెలుపు తథ్యం -మెజార్టే లక్ష్యం

### అందోల్ సెంటిమెంట్ వరించేనా ?

| | |
|---|---|
| 1952-1985 | - కాంగ్రెస్ |
| 1985-1989 | - టీడీపీ |
| 1989-1994 | - కాంగ్రెస్ |
| 1994-1999 | - టీడీపీ |
| 1999-2009 | - కాంగ్రెస్ |
| 2014-2023 | - టీఆర్ఎస్ |

రేగోడ్, నవంబర్ 11 : అందోల్ ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు 1952లో అందోల్ నియోజకవర్గం ఏర్పడింది. ఈ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 15 సార్లు ఇక్కడ గెలుపొందిన పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 1967లో ఎస్సీ రిజర్వ్‌గా మారింది. ఇక్కడ ఏపార్టీ గెలిస్తే ఆపార్టీ మాత్రమే రాష్ట్రంలో పాలించింది. ఈ సారి కూడా ఈ సెంటిమెంట్ వర్తిస్తుందని బీఆర్ఎస్ నాయకుల అభిప్రాయం. ఇప్పుడు మళ్లీ క్రాంతికిరణ్ గెలుపు ఖాయమని, బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం అందోల్‌లో నామినేషన్‌కు సుమారు 40,000 ఓటర్లు తరలి వచ్చి గెలుపునకు నాంది పలికారని పార్టీశ్రేణులు అన్నారు. అందోల్ మొత్తం జనసంద్రంగా మారి బీఆర్ఎస్ ఒక ప్రవాహంలా కనిపించిందన్నారు. గెలుపుతథ్యం –మెజార్టే లక్ష్యం అని పార్టీ అభిమానులన్నారు.

## పటాకుల దుకాణదారులు అనుమతి తీసుకోవాలి

### మెదక్ ఎస్పీరోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, నవంబర్ 11 : దీపావళి ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్క రూ జరుపుకోవాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా బాణా సంచా, పటాకులు ఇండ్లలో,షాపుల్లో, జన సముదాయాల మధ్య గోడౌన్లలో అనుమతి లేకుండా స్టాకు నిల్వలు చేసినా, లైసెన్స్ లేకుండా అనధికార విక్రయాలు జరిపినా, బాణాసంచా విక్రయించే దుకాణదారులు పోలీసులు సూచించిన నియమనిబంధనలు తప్పని సరిగా పాటించకపోయినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

**డయల్ 100/112 :** జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా మందు గుండు సామగ్రి తయారు చేసినా, విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100/112కి గానీ మీ దగ్గరలోని స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పటాకులు దుకాణల ఖాళీ ప్రదేశాల్లో జన వాసాలకు దూరంగా నెలకొల్పవలెనని, ఖాళీ ప్రదేశానికి సంబంధించి ఎన్‌వోసీ సర్టిఫికెట్ పొందుపర్చాలన్నారు. దుకాణం–దుకాణం మధ్య వ్యత్యాసం 3 మీటర్లు, రెసిడిన్షియల్, గృహనిర్మాణాలకు 50 మీటర్ల దూరం లో ఉండాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద అగ్ని నిరోధక సిలిండర్స్ తగినంద పొడి ఇసుక కావాల్సిన నీరు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అనుమతి పొందిన దుకాణదారులు అధికారులు సూచించిన సమయాల్లో మాత్రమే విక్రయాలు జరపాలని సూచించారు.

## చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్

మెదక్ అర్బన్, నవంబర్11: చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లాలోని మెదక్ నియోజకవర్గంలోని ఎస్ఎస్‌టీ, రామాయంపేట, నేషనల్ హై వే పోలీస్ చెక్‌పోస్టు నిజాంపేట్ వద్ద జిల్లాల సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీంల పనితీరును సంజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ టీంలకు పలు సూచనలు సలహాలు అందించారు. ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేయాలని ఆదేశించారు. ప్రత్యేక నిఘా కోసం ఏర్పాటు చేసిన టీంలు మెరుగైన పని తీరును కనబర్చాలన్నారు.

## 'ఖేడ్' నియోజకవర్గంలో 2,31,188 మంది ఓటర్లు

నారాయణఖేడ్, నవంబర్ 11 : ఎన్నికల నిబంధనల ప్రకారం శుక్రవారం ఖరారు చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం 2,31,188 మంది ఓటర్లు ఉన్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వెంకటేశ్ తెలిపారు. 1,16,581 మంది పురుషులు, 1,14,599 మంది స్త్రీలు, 8 మంది ఇతరులు ఉన్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరాయంగా చేపట్టి తుది జాబితా ఖరారు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

# పారదర్శకంగా ఎన్నికలు జరిపించాలి

- ఎన్నికల వేల ప్రజల్లో నమ్మకాన్ని ధైర్యాన్ని కలిగించాలి
- ఎస్పీ రోహిణి ప్రియదర్శిని




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, నవంబర్ 11 : పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఎస్పీ రోహిణిప్రియదర్శిని అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల విధుల్లో నిర్వహించాల్సిన అంశాలపై పోలీస్ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడం సంఘ వ్యతిరేక శక్తుల కార్యకర్తలను ఊరేగింపులు, బహిరంగ, సమావేశాలు నిర్వహణ క్రమబద్ధం చేయడం ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం కలిగించాలన్నారు. ఎన్నికల ప్రచారం శాంతియుతంగా న్యాయబద్ధంగా జరిగేటట్లు హింసాత్మక సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సరిహద్దు జిల్లాల పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, నగదు, మద్యంపై ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తోనే గ్రామాల అభివృద్ధి



సిర్గాపూర్ : పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, నవంబర్ 11: గతంలో అధికారం చేపట్టిన కాగ్రెసోళ్లు చేసిన అభివృద్ధి శూన్యమని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వంగ్ధాల్ గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన 20 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీకండువా కప్పి భూపాల్‌రెడ్డి ఆహ్వానించారు. పార్టీలో చేరి న వారిలో షారుఖ్, పండరి, సుభాష్ రావుపాటిల్, దేవిదాస్, భరత్, రామప్ప, మల్లేశ్, కిష్ట, విఠల్, విలాష్, శ్రీకాంత్, అనిల్‌కుమార్, ప్రవీణ్, నవీన్, శివాజీ, డి. శ్రీకాంత్, సంజుకుమార్, తుకారంపాటిల్, గోవింద్ ఉన్నారు. అభివృద్ధికి చూసి ఓటెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, యాదవరావు, సంగం సర్పంచ్ రవి పాటిల్ నాయకులు ఉన్నారు.

# సీసీ కెమెరాల నిఘాలో

- వెబ్ కాస్టింగ్ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నియమావళిలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధల మేరకు సీసీ టీవీ, కెమెరాల, నిఘా పర్యవేక్షణలో ఎన్నికలు జరపాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో వెబ్ కాస్టింగ్, సీసీ టీవీ కెమెరాల ప్రతినిధులతో మాట్లాడారు. సీసీ టీవీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వెబ్ కేటగిరీలు విభజన, సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. తాగు నీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్‌సీసీ వలంటీర్స్‌ను ఓటింగ్ ప్రక్రియలో వినియోగించుకోవాలని సూచించారు. వారికి ఒక రోజు ట్రైనింగ్ ఇవ్వాలని, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూంలలో పకడ్బందీగా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, డీపీవో సాయిబాబా, ఈడీఎం సందీప్, డీఎస్‌వో రాజిరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

# సీఎం ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు

- మెదక్ సీఎస్ఐ గ్రౌండ్‌లో సభాస్థలి
- మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

మెదక్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): మెదక్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ రానున్న సీఎం ప్రజా ఆశీర్వాద సభకు మెదక్ జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ గ్రౌండ్‌లో సుమారు 10 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సీఎస్ఐ గ్రౌండ్‌లో సీఎం సభా స్థలిని మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నందు జనార్దన్‌రెడ్డి, లింగారెడ్డి, రాగి అశోక్, జుబేర్ తదితరులు పరిశీలించారు. అనంతరం కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం ఆశీర్వాద సభలో 50 వేల మంది ప్రజలు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభ వద్ద జర్నలిస్టులు, మహిళలు, పురుషులు వేర్వేరుగా కూర్చునేలా బారికేడ్లను ఏర్పాట్లు చేస్తామన్నారు. సభకు వచ్చే ప్రజల వాహనాల రాకపోకలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మెదక్ నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరానున్నారన్నారు. మూడోసారి సీఎం కేసీఆర్, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు.

### సభా ప్రాంగణం సమీపంలోనే హెలిప్యాడ్

సీఎస్ఐ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న సభా స్థలి సమీపంలోనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో సీఎం సభ ముగించుకుని నేరుగా మెదక్ జిల్లా కేంద్రంలోని సభా స్థలికి చేరుకుంటారు. అక్కడ మెదక్ నియోజకవర్గానికి చెందిన నేతలు సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతారు. అనంతరం వేదికపైకి కేసీఆర్ చేరుకుంటారు.